


నమస్తే తెలంగాణ

భద్రాద్రి కొత్తగూడెం

3 ఖమ్మం, బుధవారం 7 మే 2025 BHADRADRI KOTHAGUDEM


# 9న తల్లాడకు కేటీఆర్

**'రాయల' విగ్రహావిష్కరణకు హాజరుకానున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్: తాతా, సండ్ర**

సత్తుపల్లి, మే 6: తల్లాడ మండలం కొత్త మిట్టపల్లిలో డీసీసీబీ మాజీ చైర్మన్ రాయల శేషగిరిరావు విగ్రహావిష్కరణకు ఈ నెల 9న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హాజరుకానున్నట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. మిట్టపల్లిలో మంగళవారం జరిగిన నియోజకవర్గస్థాయి విస్తృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. కేటీఆర్ హాజరుకానున్న కార్యక్రమానికి ప్రజలు తరలిరావాలని కోరారు. అనంతరం



ఎమ్మెల్సీ తాతా మధు, సండ్ర కలిసి హెలిపాడ్ స్థలాన్ని పరిశీలించారు. బీఆర్ఎస్ నాయకులు తాళ్లూరి జీవన్, కట్టా అజయ్‌కుమార్, దుగ్గిదేవర వెంకట్‌లాల్, కనగాల వెంకట్రావు, దొడ్డా శ్రీనివాసరావు, లక్కినేని రవి, భాస్కర్‌రావు, దిరిశాల దాసు, కేతినేని చలపతిరావు, ముమ్వా మురళీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

**పర్యటనను జయప్రదం చేయండి: సండ్ర**

తల్లాడ మండలం మిట్టపల్లిలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రాయల శేషగిరిరావు విగ్రహావిష్కరణ సందర్భంగా ఈ నెల 9న జరిగే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటనను జయప్రదం చేయాలని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య క్యాంపు కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. అతిథులుగా రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు హాజరవుతారని కార్యాలయ బాధ్యులు పేర్కొన్నారు. అన్ని మండలాల ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

# ఉన్నవి పెరగవు.. కొత్తవి రావు

- ఖమ్మం జిల్లాలో 'ఆసరా' పింఛన్ల పరేషాన్
- జిల్లాలో 17,500 మంది ఎదురుచూపులు
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న వృద్ధులు
- ఇచ్చిన హామీని నెరవేర్చని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ఖమ్మం, మే 6: తాము అధికారంలోకి రాగానే ఆసరా పింఛన్లను రెట్టింపు చేస్తామంటూ 2023 శాసనసభ ఎన్నికల సందర్భంగా నాటి పీసీసీ అధ్యక్షుడు హామీలు గుప్పించారు. పింఛన్ మొత్తం పెరుగుతుందని నమ్మిన ఆసరా పింఛన్‌దారులు ఆ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించారు. హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. ఇది జరిగి 16 నెలలు పూర్తయింది. కానీ.. హామీ మాత్రం నెరవేరలేదు. ఆసరా పింఛన్ల మొత్తాన్ని పెంచలేదు. పైగా గత కేసీఆర్ ప్రభుత్వం తెచ్చిన పింఛన్లనే నేటికీ ఇస్తున్నారు. దీంతో '16 నెలలు దాటిపోయింది. పింఛన్ల మొత్తాన్ని ఇంకెప్పుడు పెంచుతారో?' అనుకుంటూ వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, కల్లుగీత కార్మికులు, ఎయిడ్స్ బాధితులు కళ్లలో ఒత్తులేసుకొని మరీ ఎదురుచూస్తున్నారు.

### నాడు అండగా కేసీఆర్..

నిరుపేదలకు సాంఘిక భద్రత కల్పించేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం ఆసరా పింఛన్ల పథకాన్ని ప్రవేశపెట్టింది. 2014 అక్టోబర్‌లో ఆరంభించిన ఈ పథకం ద్వారా జిల్లాలో లక్షలమంది నిరుపేదలకు మేలు చేకూరుతోంది. సమాజంలో అత్యంత నిస్సహాయ స్థితిలో ఉన్న వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, చేనేత, కల్లుగీత కార్మికులు, ఎయిడ్స్ బాధిత వ్యక్తులకు రోజువారీ కనీస అవసరాలు తీర్చేందుకు, వారి జీవితాన్ని గౌరవప్రదంగా గడుపుకునేందుకు నాటి ముఖ్యమంత్రి కేసీఆర్.. ఈ ఆసరా పింఛన్లను తెచ్చారు. తెలంగాణను తెచ్చి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పటి నుంచి 2023 నవంబర్ వరకు కేసీఆరే పింఛన్లు అందజేశారు. వృద్ధులు, వితంతువులు, చేనేత, కల్లుగీత కార్మికులు, ఎయిడ్స్ బాధితులు, బీడీ కార్మికులకు రూ.2,016 చొప్పున, దివ్యాంగులకు రూ.4,016 చొప్పున అందించారు. కరోనా లాంటి క్లిష్ట సమయంలో కూడా ఆసరా పింఛన్లను కేసీఆర్ ఆపలేదు.

### హామీ ఇచ్చి 16 నెలలు..

అప్పటి వరకూ కేసీఆర్ ఇస్తున్న రూ.2,016 పింఛన్లను రూ.4,016గా ఇస్తామని, రూ.4,016 పింఛన్లను రూ.6,016గా ఇస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. 16 నెలలు దాటిపోయినా ఆ పెంచిన పింఛన్లను ఇవ్వడం లేదు. దీంతో ఇప్పటికే పింఛన్ పొందుతున్న లబ్ధిదారులు, కొత్తగా చేరే లబ్ధిదారులు ఎదురుచూపులు చూస్తున్నారు.

### 17,500 మంది ఎదురుచూపులు

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు కోసం ఖమ్మం జిల్లాలో కొత్తగా 17,500 మంది ఎదురుచూస్తున్నారు. వీరిలో ఖమ్మం జిల్లాలోని 21 మండలాకు చెందిన వృద్ధులు, వితంతువులు, చేనేత, కల్లుగీత కార్మికులు, ఎయిడ్స్ బాధితులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, బోదకాలు బాధితులు, డయాలసిస్ బాధితులు, వికలాంగులు ఉన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో 57 ఏళ్ల వయసున్న వారికి ఆసరా పింఛన్లు అందజేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో వృద్ధాప్య పింఛన్ తీసుకుంటూ భర్త మృతిచెందితే ఆ స్థానంలో భార్యకు పింఛన్ ఇస్తున్నారు. కానీ.. చేనేత కార్మికులు, డయాలసిస్ బాధితులు, ఎయిడ్స్ బాధితులు, దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు చనిపోతే మాత్రం వారి జీవిత భాగస్వాములకు పింఛన్ ఇవ్వడం లేదు. ఇదిలా ఉండగా.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వృద్ధాప్య పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవాలంటే 65 ఏళ్ల వయసు తప్పనిసరిగా ఉండేలా నిబంధనలు తీసుకురావడం గమనార్హం.

**జిల్లాలో వివిధ రకాల పింఛన్‌దారులు**

| రకాలు | పింఛన్‌దారులు | నెలకు ఒక్కొక్కరికీ.. |
|---|---|---|
| వితంతువులు | 70,939 | రూ.2,016 |
| చేనేత వృత్తిదారులు | 434 | రూ.2,016 |
| వృద్ధులు | 71,278 | రూ.2,016 |
| కల్లుగీత కార్మికులు | 3,177 | రూ.2,016 |
| ఎయిడ్స్ బాధితులు | 2,561 | రూ.2,016 |
| బీడీ కార్మికులు | 02 | రూ.2,016 |
| బోదకాలు | 1395 | రూ.2,016 |
| డయాలిసిస్ భాధితులు | 133 | రూ.2,016 |
| ఒంటరి మహిళలు | 8488 | రూ.2,016 |
| దివ్యాంగులు | 28,069 | రూ.4,016 |
| మొత్తం | 1,86,476 | |

# పాలన చేతకాకుంటే తప్పుకోండి..

- ఇచ్చిన హామీలు అమలు చేయలేకనే చిల్లర మాటలు
- బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో 'సండ్ర'



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

పెనుబల్లి, మే 6: పరిపాలన చేతకాకపోతే సీఎం రేవంత్‌రెడ్డి తన బాధ్యతల నుంచి తప్పుకోవాలని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య డిమాండ్ చేశారు. అంతేగానీ నోరుందని చెప్పి ఇష్టారీతిగా, అవగాహన రహితంగా మాట్లాడడం సరికాదని అన్నారు. పెనుబల్లిలో మంగళవారం ఏర్పాటుచేసిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో నోటికొచ్చిన హామీలు గుప్పించారని, అధికారం దక్కి కుర్చీ ఎక్కిన తర్వాత చేతులెత్తేస్తున్నారని విమర్శించారు. 'నా వల్ల కాదు.. నన్ను చూసి ఎవరూ అప్పు ఇవ్వడం లేదు' అంటూ స్వయంగా ముఖ్యమంత్రే మాట్లాడుతుండడం సిగ్గుచేటని అన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం కేసీఆర్ అప్పులు చేసినప్పటికీ సంపదను తెచ్చిపెట్టారని గుర్తుచేశారు. రైతులు ఆరుగాలం శ్రమించి ధాన్యాన్ని పండిస్తే.. కొనుగోలు చేసే సోయి కూడా ఈ ప్రభుత్వానికి లేదని దుయ్యబట్టారు. ఈ నెల 9న తల్లాడ మండలం మిట్టపల్లిలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రాయల శేషగిరిరావు విగ్రహావిష్కరణకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వస్తున్నందున ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నాయకులు కనగాల వెంకట్రావు, చెక్కిలాల మోహన్‌రావు, కోటగిరి సుధాకర్‌బాబు, లక్కినేని వినీల్, తేజావత్ తావునాయక్, గోదా చెన్నారావు, టీవీ రామారావు, కనగాల సురేష్‌బాబు, ఎస్కే గౌస్, బెల్లంకొండ చలపతిరావు, మల్లెల శ్రీను, కొత్తగుండ్ల అప్పారావు, వంగా గిరిజాపతి, శ్రీనివాసరెడ్డి, పొట్లపల్లి ప్రసాద్, మరకాల చంటి, చావల గణేశ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంతలను..

# వారం రోజుల్లోగా పూర్తి చేయాలి

- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను రూపొందించాలి
- అధికారుల టీసీలో భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్



భద్రాద్రి కొత్తగూడెం, మే 6 (నమస్తే తెలంగాణ): జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లోనూ ఇంకుడు గుంతలు నిర్మించాలని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సూచించారు. వారం రోజుల్లోగా వీటి నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 'జిల్లాలో పురోగతిలో ఉన్న ఇంకుడు గుంతలు - పామ్‌పాండ్స్ నిర్మాణాలు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలు' అనే అంశాలపై అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన, ఆర్డీవోలు, జిల్లా అధికారులతో కలిసి జిల్లాలోని తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులతో మంగళవారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు తదితర అన్ని కార్యాలయాల్లో ఇంకుడు గుంతలు నిర్మాణాలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. ప్రతీ ఎకరానికి ఐదు ఇంకుడు గుంతలు, అర ఎకరానికి మూడు ఇంకుడు గుంతలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడెక్కడ వర్షం నీళ్లు నిల్వ ఉంటాయో గుర్తించి ఆయా చోట్ల ఎక్కువ ఇంకుడు గుంతలు నిర్మించాలని సూచించారు. వచ్చే వారం నుంచి వ్యవసాయ శాఖ అధికారులు జిల్లాలోని వ్యవసాయ యోగ్యమైన భూముల్లో నీటి కుంటల (పామ్ పాండ్స్) నిర్మాణానికి మార్కింగ్ పూర్తి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా మూడున్నర లక్షల ఎకరాల సాగు భూమి ఉన్నందున దానిలో పదో వంతు చొప్పున 34 వేల నీటి కుంటల తవ్వకాలు చేపట్టాలని సూచించారు. పది ఎకరాలకు ఒక నీటి కుంట తప్పనిసరిగా ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. ఉపాధి హామీ సిబ్బంది, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి నీటి కుంటల నిర్మాణాలకు మార్కింగ్ పూర్తి చేయాలన్నారు. అలాగే, జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా రూపకల్పన ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**చివరి గింజ వరకూ ధాన్యం కొనుగోలు చేస్తాం..**

**కేంద్రాల తనిఖీలో ఖమ్మం కలెక్టర్**

# తాలు, తరుగు పేరుతో కోతలు పెట్టొద్దు



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఖమ్మం కలెక్టర్

ఖమ్మం రూరల్, మే 6: ధాన్యంలో తాలు, తరుగు పేరుతో కోతలు విధించి రైతులను ఇబ్బంది పెట్టొద్దని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. గుదిమళ్ల గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడే ఉన్న రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం శుభ్రం చేసే యంత్రంతోపాటు ఇతర పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో వేగం పెరిగిందని, ఈ విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందొద్దని, నాణ్యమైన పంటను చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. కేంద్రాల వద్ద వాహనాలు, హమాలీల కొరత లేకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కొనుగోళ్లను వేగవంతం చేశామన్నారు. కొనుగోలు కేంద్రాలకు కేటాయించిన ధాన్యం రైస్ మిల్లులకు మాత్రమే తరలించాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తూ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, ఏ దశలోనూ రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# సింగరేణి డ్రైవర్‌ను అరెస్టు చేసిన ఏసీబీ

- పలువురు బాధితుల ఫిర్యాదులతో 'సింగరేణి విజలెన్స్' విచారణ
- ప్రాథమికంగా రూ.32 లక్షలు వసూలు చేసినట్లు ధ్రువీకరణ
- అనంతరం అవినీతి నిరోధక శాఖ అధికారులకు అప్పగింత
- విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన ఏసీబీ డీఎస్పీ రమేశ్



ఏసీబీ అరెస్టు చేసిన డ్రైవర్ రాజేశ్వరరావు

కొత్తగూడెం సింగరేణి, మే 6: సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్ మెయిన్ వర్క్‌షాప్‌లో మోటర్ వెహికిల్ (ఎంవీ) డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న అన్నబోయిన రాజేశ్వరరావును ఏసీబీ డీఎస్పీ వై.రమేశ్ మంగళవారం అరెస్టు చేశారు. కొత్తగూడెంలోని ఇల్లెందు గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలను ఏసీబీ డీఎస్పీ వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. అన్నబోయిన రాజేశ్వరరావు మూడు నాలుగేళ్లుగా పలు అక్రమాలకు తెరలేపారు. సింగరేణి కార్మికుల్లో మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న వారిని, అనారోగ్య సమస్యలతో బాధపడుతూ రిక్వెస్టులు, ట్రాన్స్‌ఫర్లు, డిప్యూటేషన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని, నోటిఫికేషన్ల ద్వారా సింగరేణి ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని టార్గెట్ చేసుకున్నాడు. ఈ క్రమంలో వారిని సంప్రదించేవాడు. తన మొబైల్‌లో ఫీడ్ చేసుకున్న సింగరేణి ఉన్నతాధికారుల పేర్లను, వారి ఫోన్ నంబర్లను బాధితులకు చూపించి వారంతా తనకు తెలుసునని నమ్మబలికేవాడు. ఈ క్రమంలో మెడికల్ అన్‌ఫిట్లు, బదిలీలు, డిప్యూటేషన్లు చేయిస్తానని చెబుతూ బాధితుల నుంచి రూ.32 లక్షలు వసూలు చేశాడు. ఈ విషయమై కొందరు బాధితుల నుంచి సింగరేణి విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో వారు విచారణ చేపట్టారు. పలువురు బాధితుల నుంచి రూ.32 లక్షలను రాజేశ్వరరావు వసూలు చేసినట్లు ధృవీకరించుకున్నారు. నివేదికలు, రికార్డులను ఏసీబీ అధికారులకు అప్పగించారు. వీటి ప్రకారం ఏసీబీ అధికారులు కూడా రంగంలోకి దిగి బాధితుల నుంచి వివరాలు తెలుసుకొని నిర్ధారించుకున్నారు. ఈ క్రమంలో రాజేశ్వరరావును మంగళవారం అతడి ఇంటి వద్ద ఏసీబీ అధికారులు అరెస్టు చేసి విచారిస్తున్నారు. వరంగల్‌లోని ఏసీబీ జడ్జి ఎదుట బుధవారం హాజరుపర్చనున్నారు. రాజేశ్వరరావు బ్యాంకు లావాదేవీలు, ఫోన్ల ఆధారంగా విచారణ కొనసాగించనున్నారు. బాధితుల సంఖ్య, వారి నుంచి వసూలు చేసి మొత్తం నగదు వంటివి ఇంకా పెరిగే అవకాశం ఉంది. బాధితులు ఇంకా ఎవరైనా ఉంటే సింగరేణి విజిలెన్స్‌కుగానీ, ఏసీబీ అధికారులకుగానీ ఫిర్యాదు చేయవచ్చు.

- ముగ్గురు మంత్రులున్నా కాంట్రాక్టు వర్కర్లది అరణ్య రోదనే..
- కార్మికులకు మూడు నెలలుగా నిలిచిన వేతనాలు
- పట్టించుకోని ప్రభుత్వం, అధికార యంత్రాంగం
- విధులు బహిష్కరించి ఆందోళనకు దిగిన బడుగు జీవులు
- మున్సిపల్ కార్మికులతో పనులు చేయించిన అధికారులు
- ప్రధానాసుపత్రిలో ప్రతి నాలుగునెలలకోసారి ఇదే తంతు

**ఖమ్మం ఇలాకాలో ఏకంగా ముగ్గురు మంత్రులున్నారు. జిల్లా ఉన్నతాధికారులూ నగరంలోనే తిరుగుతున్నారు. అయినప్పటికీ ఖమ్మం జిల్లా ప్రధాన ప్రభుత్వాసుపత్రిలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు మాత్రం ఆకలితో అలమటిస్తున్నరు. నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో బడుగు జీవులు ఖాళీ కడుపులతో రోదిస్తున్నరు. కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్య వైఖరితో విసిగి వేసారిన కార్మికులు మంగళ వారం ఆందోళనకు దిగారు. ఇప్పటివరకు నిలిచిన బకాయిలు మొత్తం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విధులు బహిష్కరించారు. తొలుత బీఆర్ఎస్, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ కార్మిక సంఘాల మద్దతుతో జనరల్ ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం మాతా, శిశు సంరక్షణ కేంద్రంలోని వెయిటింగ్ షెడ్డులో సమావేశమై ప్రభుత్వం, స్థానిక అధికారుల అలసత్వాన్ని కడిగిపారేశారు. స్థానిక మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్ వారి వద్దకు వచ్చి ఎలాంటి హామీ ఇవ్వకుండానే విధుల్లో చేరాలని కోరగా, కార్మికులు ససేమిరా అంటూ భీష్మించారు. –ఖమ్మం సిటీ, మే 6**

# పెద్దాసుపత్రిలో ఆకలి పోరాటం!



విధులు బహిష్కరించి ప్రధాన ఆసుపత్రి షెడ్‌లో కూర్చున్న కాంట్రాక్టు కార్మికులు

పెద్దాసుపత్రిలో నెలకొన్న సమస్యను పరిష్కరించడంలో స్థానిక యంత్రాంగం పూర్తిగా విఫలమవుతోంది. గత బీఆర్ఎస్ సర్కారు హయాంలో కార్మికులకు క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించేవారు. తెలంగాణలో ఎప్పుడైతే అధికార మార్పిడి జరిగిందో నాటినుంచి పరిస్థితులు పూర్తిగా మారాయి. నాలుగు నెలలు గడిచినా వేతనాలు అందని దుస్థితి నెలకొంది. గత్యంతరం లేక బడుగు జీవులు ఆందోళనకు దిగితే కలెక్టర్ లేదా స్థానిక వైద్యాధికారులు జోక్యం చేసుకుని మున్సిపల్ కార్మికులను రప్పించి పోలీసు పహారాలో పారిశుధ్య పనులు చేయిస్తున్నారు. ఆ క్రమంలో కార్మికులు, అధికారులు, పోలీసులకు మధ్య వాగ్వాదం, తోపులాట జరగడం నిత్యకృత్యంగా మారింది. మంగళవారం సైతం ఆసుపత్రిలో వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధం వస్తున్న నేపథ్యంలో నగరపాలక సంస్థకు చెందిన పారిశుధ్య కార్మికులను తీసుకొచ్చారు. దీంతో కోపోద్రిక్తులైన ఆసుపత్రి కార్మికులు అడ్డుకున్నారు. తమ ఆకలి పోరాటానికి సహకరించాలని పోలీసులను కాళ్లావేళ్లా పడి బతిమాలుకున్న తీరు ప్రతి ఒక్కరినీ ఆలోచనలో పడేసింది. ఉమ్మడి ఖమ్మంతోపాటు మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల నుంచి వైద్యసేవల నిమిత్తం దవాఖానకు వస్తున్న వందలాది మంది రోగులు, వారి సహాయకులకు సరైన వసతులు లభించక తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

**నాలుగునెలలకోసారి ఆందోళన**

ఖమ్మంజిల్లా ప్రభుత్వాసుపత్రిలో ప్రతి నాలుగునెలలకోసారి కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు ఆందోళనకు దిగడం పరిపాటిగా మారింది. కాంగ్రెస్ సర్కారు ఏడాదిన్నర పాలనలో ఆరు దఫాలు వేతనాల కోసం ధర్నాలు జరిగాయంటే అక్కడి దయనీయ పరిస్థితికి అద్దం పడుతున్నది. ప్రతి సందర్భంలోనూ ఒకటి లేదా రెండు నెలల వేతనం ఇవ్వడం, కార్మికులను ఏమార్చడం షరా మామూలైంది. సర్కారు నుంచి పైసలు వస్తేనే తాను వేతనాలు చెల్లిస్తానంటూ సంబంధిత గుత్తేదారు చేతులెత్తేస్తున్నాడు.. తామేమీ చేయలేమంటూ స్థానిక వైద్యాధికారులు మిన్నకుండిపోతున్నారు.. వెరసి కాంట్రాక్ట్ కార్మికులు అర్ధాకలితో మగ్గడం, రోగులు తీవ్ర అవస్థలు పడటం పాలకులకు కనిపించకపోవడం శోచనీయం. జిల్లా నుంచి ముగ్గురు మంత్రులైన మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్నప్పటికీ జిల్లా దవాఖాన వైపు కన్నెత్తి చూడకపోవడంపై పలు కార్మిక, ప్రజా సంఘాలకు చెందిన నాయకులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే సమస్యను పరిష్కరించకుంటే వారి క్యాంపు కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆందోళనలో బీఆర్ఎస్ కార్మిక సంఘం నాయకుడు మాతంగి అనిల్, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



ఆసుపత్రి పరిసరాలను శుభ్రం చేస్తున్న కేఎంసీ పారిశుధ్య కార్మికులు

# గాలివాన బీభత్సం

- ఖమ్మం జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం
- ఖమ్మం రూరల్ కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- జిల్లా కేంద్రంలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం
- తల్లాడ - వైరా ప్రధాన రహదారిపై కూలిన భారీ వృక్షాలు
- జేసీబీ యంత్రాలతో తొలగించిన సంబంధిత అధికారులు



నీళ్లు తొలగిస్తున్న మహిళా రైతు

ఖమ్మం రూరల్/ రఘునాథపాలెం, మే 6: ఖమ్మం జిల్లాలో గాలివాన బీభత్సం సృష్టించింది. జిల్లా కేంద్రం సహా పరిసర మండలాల్లో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఆ వెంటనే బలమైన గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దాదాపు 30 నిమిషాలపాటు ఈదురు గాలులు వీచాయి. దీంతో ఖమ్మం జిల్లా కేంద్రంలోనూ సుమారు 2 గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది ఇక ఖమ్మం రూరల్ మండలంలోని గుదిమళ్ల, గుర్రాలపాడు, గోళ్లపాడు గ్రామాల్లో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యమంతా తడిసిపోయింది. అప్పటికే రైతులు ఉరుకులు పరుగులు పెట్టి సొంత టార్పాలిన్లు కప్పుతూ పంటను కాపాడుకునేందుకు ప్రయత్నించినా చాలా వరకూ పంట నష్టం జరిగింది. తల్లాడ – వైరా ప్రధాన మార్గంలో గాలిదుమారానికి భారీ వృక్షాలు కూలడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అధికారులు జేసీబీ యంత్రాలతో చెట్లను తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

**స్తంభించిన జనజీవనం..**

భానుడి భగభగలతో మధ్యాహ్నం వరకూ ముప్పుతిప్పలు పడ్డ ఖమ్మం నగర వాసులపై వరుణుడు సాయంత్రం విరుచుకుపడ్డాడు. భారీగా కురిసిన వర్షం వల్ల జిల్లా కేంద్రంలో జనజీవనం స్తంభించింది. ఖమ్మం నగరంలోని రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ వైర్లు తెగి పడటంతో మూడు గంటలకు పైగా ఖమ్మంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో నగర ప్రజలు కొంత ఇబ్బందులు పడ్డారు. త్రీటౌన్ ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వైరా రింగు రోడ్డు సెంటర్‌లో భారీ వృక్షం నేలకూలింది. దీంతో మోటర్ సైకిల్ ధ్వంసమైంది. వైరా వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో ధాన్యం నీటమునిగింది.



ఖమ్మం రూరల్: గుదిమళ్ల కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం బస్తాలు



ఖమ్మం నగరంలో కురుస్తున్న వర్షం



జలమయంగా పాత బస్టాండ్ ప్రాంతం



ధాన్యం రాశిపై టార్పాలిన్ కప్పుతున్న రైతులు



వైరాలో రహదారిపై విరిగి పడిన చెట్టు